క్లుప్తంగా

పిచ్చి మొక్కల తొలగింపు

అశ్వారావుపేటరూరల్: ఎట్టకేలకు ప్రధాన, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో చేపట్టాల్సిన జంగిల్ కటింగ్ పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని వాగొడ్డుగూడెం నుంచి పండువారిగూడెం వెళ్లే మార్గం, అశ్వారావుపేట శివారు నుంచి వినాయకపురం వెళ్లే ప్రధాన రహదారుల ఇరువైపుల పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి రోడ్లను కమ్మేశాయి. దాంతో ఈ పిచ్చి మొక్కలు ప్రమాదకరంగా మారగా, వీటిని తొలగించాలని వాహనదారులు, రోడ్లు భవనాల శాఖ అధికారులు మొర పెట్టుకున్న పట్టించుకోలేదు. కాగా గడిచిన కొద్ది రోజులుగా ఆయా మార్గాల్లో జేసీబీలు, బ్లేడ్ ట్రాక్టర్లతో ముమ్మరంగా పిచ్చి మొక్కలను తొలగించి, శుభ్రం చేసే పనులు చేస్తున్నారు. దాంతో వాహనదారులు, ప్రయాణికుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

15 బోర్లు ఏర్పాటు

బూర్గంపాడు: షిలోహు మినిస్ట్రీస్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంతాల్లో 15 బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు సంఘ వ్యవస్థాపకులు పాస్టర్ మోజెస్ ములక అన్నారు. మండల కేంద్రం బూర్గంపాడులో సోమవారం షిలోహు మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బోర్లు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏజెన్సీలోని ప్రార్థన మందిరాల్లో, తాగునీటికి ఇబ్బందులున్న ప్రాంతాల్లో బోర్లు వేస్తున్నామన్నారు. ఈ బోర్ల ఏర్పాటుకు రూ.7.50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. బూర్గంపాడు, కుక్కునూరు, వేలేరుపాడు, అశ్వాపురం, వీఆర్ పురం,కూనవరం, ఎటపాక, పినపాక, కరకగూడెం మండలాల్లో ఈ బోర్లు వేయించేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు చింతల ప్రవీణ్ కుమార్, స్టీవ్ ఏలియట్ ములక, షాలోమ్ రాజు, సైమన్, పెద్దారావు, మహిమ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాలలో డోలోత్సవం

దుమ్ముగూడెం: పర్ణశాల సీతారామచంద్రస్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా డోలోత్సవం, వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా స్వామివారికి విశ్వక్షేన పూజ, పుణ్యాహవాచనం, లక్ష్మీ పూజ, నిర్వహించారు. గ్రామంలోని ముత్తయిదువుల చేత పసుపు కొట్టే కార్యక్రమం, తలంబ్రాలు కలిపే కార్యక్రమం, తదుపరి మూలవర్లకు ఉత్సవమూర్తులకు వసంతోత్సవం సంప్రోక్షణ చేపట్టారు. అనంతరం స్వామి వారిని పెళ్లి కొడుకును చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువారాధన, తిరువీధి సేవ, విశేష ప్రసాదం నివేదన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శేషం కిరణ్‌కుమార్ ఆచార్యులు, అమరవాది వెంకట్రామన్ భార్గవాచార్యులు, ఆలయ అధికారులు సూపరింటెండెంట్ కిషోర్, ఉత్సవాల ఇన్‌చార్జ్ అనిల్, ఆలయ ఇన్‌చార్జి ప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

షిఫ్టులు మార్చొద్దు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ కార్మికులను ఇష్టానుసారంగా షిఫ్టులు మారుస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు అన్నారు. సోమవారం పీవీకాలనీలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ విషయమై ప్రాజెక్ట్ ఆఫీసరును ప్రశ్నిస్తే నిర్లక్ష్యపు సమాధానం చెబుతుండటం సరికాదన్నారు. మణుగూరులో గెలుపొందిన ఐఎన్‌టీయూసీ నాయకుల అభిప్రాయాలను నిర్లక్ష్యం చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ తీరును ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో పాటు ఐఎన్‌టీయూసీ కేంద్ర నాయకుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు గట్టయ్య యాదవ్, రాములు తదితరులు ఉన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

కరకగూడెం: నేతకాని కులంపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గుమ్మడి కుమారస్వామి రెండు రోజుల క్రితం చేసిన అనుచిత వాఖ్యలు సరికావని ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్, నేతకాని రాష్ట్ర నాయకుడు జాడి నాగరాజు పేర్కొన్నారు. ఈ మేరకు వారు సోమవారం మండల పరిధిలోని తాటిగూడెం గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నేతకాని కులాన్ని తక్కువ చేసి మాట్లాడిన కాంగ్రెస్ నేత మాటలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అతనిపై కేసు పెట్టి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కొండగొర్ల కోటేష్, జాడి లక్ష్మీనారాయణ, దుర్గం సురేందర్, జాడి సోమయ్య, రామటంకి దామోదర్, జాడి వినయ్ ,జిమ్మిడి పూలమ్మ, జాడి భాగ్యలక్ష్మి, రితీష్, జాడి వినయ్, సురేందర్ పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల హర్షం

ములకలపల్లి: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా ములకలపల్లి మండలవాసి తాండ్ర వినోద్‌రావును ఎంపిక చేయడంపై పార్టీ మండల అధ్యక్షుడు అనుమల శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన ఎన్నికపట్ల పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వినోద్‌రావును కోరారు. పెండ్యాల వెంకట అప్పారావు, గొడ్ల రాజయ్య, తోట వెంకటేశ్వర్లు, పాలకుర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

గ్రామాలు, పట్టణాల్లో సోమవారం పెద్దలు, పిల్లలు కలసి హోలీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. బంధు, మిత్రులను కలిసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఉరుకు పరుగులతో ఒకరిపై ఒకరు రకరకాల రంగులు చల్లుకున్నారు. సాయంత్రం వరకు రంగుల్లో మునిగి తేలారు. సందడి వాతావరణంలో ఆనందోత్సాహాలతో గడిపారు. మరోవైపు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు సైతం ఆయా ప్రాంతాల్లో వేడుకల్లో పాల్గొన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో రంగులు చల్లుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


కరకగూడెం: హోలీ వేడుకల్లో చిన్నారులు


మణుగూరుటౌన్: కాంగ్రెస్ నాయకులకు రంగులు పూస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


బూర్గంపాడు: హోలీ వేడుకల్లో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత


భద్రాచలంటౌన్: రంగులు చల్లుకుంటున్న పట్టణ వాసులు


ములకలపల్లి: హోలీ ఆడుతున్న చిన్నారులు


దమ్మపేట: హోలీ పండుగ ఆనందోత్సాహాలతో పిల్లలు


మణుగూరుటౌన్: హోలీ సంబురాల్లో సింగరేణి ఏరియా జీఎం, అధికారులు


అశ్వారావుపేటరూరల్: రంగులు చల్లుకుని సందడి చేస్తున్న పిల్లలు, మహిళలు


దుమ్ముగూడెం: సంబరాల్లో యువకులు


అశ్వాపురం: మొండికుంటలో హోలీ వేడుకల్లో యువత


చర్ల: హోలీ వేడుకలు జరుపుకుంటున్న చిన్నారులు


గుండాలలో..


చండ్రుగొండ: తిప్పనపల్లిలో..

రామయ్య సన్నిధికి గోటితలంబ్రాలు

దుమ్ముగూడెం: మండలంలోని డబ్ల్యూఎల్ రేగుబల్లి గ్రామానికి చెందిన భక్తులు హిందూ సంఘం అధ్యక్షుడు జెట్టి వెంకటరాజు ఆధ్వర్యంలో గోటి తలంబ్రాలను శ్రీరాముని కల్యాణం కోసం భద్రాచలం రామాలయం సన్నిధికి సోమవారం చేర్చారు.ఈ సందర్భంగా రేగుబల్లి గ్రామం నుండి మేళతాళాలతో ఊరేగింపుగా తలంబ్రాలను తీసుకుని భద్రాచలం వెళ్లి రామయ్య సన్నిధికి తలంబ్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాణి, సావిత్రి, సరోజినీ, సుధారాణి, నాగేశ్వరి, రత్నకుమారి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: భద్రాచలం రామయ్య కల్యాణాన్ని అందించేందుకు గోటితో వలిచిన కోటి తలంబ్రాలతో సోమవారం భక్తులు ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని గుమ్మడవల్లి గ్రామ పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన రామయ్య భక్తులు గడిచిన నెల రోజులుగా ఎంతో భక్తిశ్రద్ధలతో కోటి తలంబ్రాలను గోటితో వలిచి సిద్ధం చేయగా, వాటిని గ్రామ పురవీధుల్లో రామ నామం జపిస్తూ.. ఊరేగించారు. కోటి తలంబ్రాలను భద్రాచలం దేవస్థానం అధికారులకు అందించారు.


దుమ్ముగూడెం: ఊరేగింపుగా తలంబ్రాలను తీసుకు వెళ్తున్న గ్రామస్తులు


గ్రామ వీధుల్లో ప్రదర్శన చేస్తున్న భక్తులు

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయతీలో లక్ష్మణ, ఆంజనేయ సమేత శ్రీకోదండ సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. రామాలయం వేదపండితుల వేదమంత్రోచ్చరణల నడుమ గర్త, భీజ, ధాతు న్యాసములు, యంత్ర ప్రతిష్ఠ, సీతారాముల వారి శాంతి కల్యాణం, మంగళ నీరాజనము, ఆశీర్వచనము తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజల్లో, అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుటూ కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఏనిక సమ్మయ్య, ఏనిక కామరాజు, మునలి శ్రీనివాస్; వల్లభనేని ఉపేందర్, కొమరగిరి కాశయ్య, పాయం శ్రీను, మందపాటి మురళి మోహన్ రాజు, సూర్య, వంశీ, రాజు, నాగేశ్వరరావు, నాగరాజు, శివ, దినేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో ఎమ్మెల్యే పాయం..

కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. వేదపండితులు మంత్రోచ్చరణలతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్వామి వార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు, సామా శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, టీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వామివారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన తలంబ్రాలు కలిపే కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్థానిక దాతలు దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బిర్రు సుధాకర్, జోగారావు, సాకేత్, కృష్ణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చర్లరూరల్: హరిహర సుతుడు అయ్యప్పస్వామి పుట్టినరోజు సందర్భంగా సోమవారం దండుపేట అయ్యప్ప నగర్ లోని అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఉ దయమే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శరణు ఘోషతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. హరి,శివ, మాల్యాద్రి, హిమగిరి, రమణ మూర్తి, శ్రీనివాస్, సాయిచరణ్, రాము, శ్రీకర్, సతీష్, రాజేష్, శ్యామ్, నరేంద్ర, నరేష్ పాల్గొన్నారు.

ముస్లింలకు బియ్యం వితరణ


కరకగూడెం: బియ్యం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యుడు సోందుపాషా

కరకగూడెం: 'ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్'సభ్యుడు, కరకగూడెం గ్రామీణ వైద్యుడు షేక్ సోందుపాషా రంజాన్ పండుగను పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని పలు గ్రామాలకు చెందిన 50 పేద ముస్లిం కుటుంబాలకు 20 కేజీల చొప్పున 10 క్వింటాల బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా ట్రస్ట్ తరుపున పేదలకు సాయం అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న ఆర్డీఓ

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి వారిని భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలను నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం పంచవటీ కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించి వాటి విశిష్టతను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

చండ్రుగొండ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించి సహకరించాలని ఎస్సై మాచినేని రవి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పార్టీల కార్యకర్తలు విధిగా నియమావళి పాటించాలన్నారు. అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు. సరైన ధృవపత్రాలు లేకుండా రూ.50 వేలకు మించి డబ్బు తీసుకెళ్తే ఆ డబ్బును సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఎన్నికల నియమ నిబంధనలు పాటించి సహకరించాలని ప్రజలను కోరారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన


మొద్దులగూడెం ఏకుల పోతమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సోమవారం మండలంలోని మొద్దులగూడెం ఏకుల పోతమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాలకు హాజరయ్యారు. మొద్దులగూడెం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దొడ్డా రమేష్, తండ్రి వెంకటేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందగా.. ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మొద్దులగూడెం, నాగుపల్లి గ్రామాల్లో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన వారి చిత్రపటాలకు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. కాగా, దొడ్డా మృతిచెందని వెంకటేశ్వరరావు భౌతిక కాయానికి మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సైతం నివాళులర్పించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి గ్రామ పంచాయతీలో ఎట్టకేలకు తాగునీటి సమస్య పరిష్కారానికి నూతనంగా సోమవారం బోరు వేశారు. గ్రామంలో గతకొంత కాలంగా తాగునీటి సమస్య నెలకొని ఉండగా, ఈ సమస్యను పరిష్కరించడంలో విఫలం కావడంతో ఈ నెల 2 వతేదిన గ్రామస్తులంతా రోడ్డెక్కి ధర్నా చేపట్టిన సంగతి తెలిసిందే. నాడు గ్రామస్తుల ఆందోళనతో అధికారులు స్పందించారు. గ్రామస్తులను కలిసి త్వరలోనే బోరు వేస్తామని హామీ ఇచ్చి ఆందోళనను విరమింపజేశారు. ఆ మేరకు ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడంతో గ్రామంలో బోరు, పైపులైన్ల నిర్మాణానికి తన కోటా కింద రూ.4.5 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో నూతనంగా బోరు, విద్యుత్ మోటారును ఏర్పాటు చేశారు. దాంతో తాగునీటి సమస్య తీరినట్లైంది.

వైద్యుడి కుటుంబానికి పరామర్శ

మణుగూరురూరల్: పట్టణ ప్రముఖ వైద్యుడు డాక్టర్ తిరుపతిరావు ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం జాతీయ నాయకుడు బి.వెంకట్, ఎం.సాయిబాబా, పోతినేని సుదర్శన్‌లు సోమవారం వారి కుటుంబానికి వెళ్లి వైద్యుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తొలుత డాక్టర్ తిరుపతిరావు చిత్రపటానికి పూలు వేసి నివాళ్లర్పించారు.

అనంతరం కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజా సమస్యలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానలను అనుసరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, సీనియర్ నాయకులు వెల్లూరి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కొడిశాల రాములు, సత్రపల్లి సాంబశివరావు, ఉప్పతల నరసింహారావు, ఉత్తం, నందం ఈశ్వర్‌రావు, హేమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి


అఖిలపక్ష నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న నరాటి ప్రసాద్

ములకలపల్లి: ములకలపల్లి మండలకేంద్రంలో డ్రెయినేజీ ఏర్పాటు, విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ నిమిత్తం నిధులు మంజూరు చేయాలని సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములకలపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపార్టీల నాయకులు మాట్లాడారు. ములకలపల్లిలో కేవలం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. ఇటీవల ఆరంభించిన 'సెంట్రల్' పనులతోపాటు, డ్రెయినేజీ నిర్మాణానికి కూడా సత్వర చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్డుపైకి వస్తున్న మురుగునీటితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా 33కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లను షిఫ్టింగ్ చేయాల్సి ఉందన్నారు. ఈ విషయమై ములకలపల్లి మండల కేంద్రం అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి, అధ్యక్షుడికి పువాల మంగపతిని ఎన్నుకున్నారు. ఈయన ఆధ్వర్యంలో నిధుల మంజూరీకి ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కలసి వినతిపత్రం అందజేయన్నట్లు తెలిపారు. నాయకులు నరాటి ప్రసాద్, నూపా భాస్కర్, ముదిగొండ రాంబాబు, కొర్సా రామకృష్ణ, ఎండి.యూసఫ్, రవికుమార్, మధు, రమేష్, సాయి, కిషోర్, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ గోపి, టీఆర్ఎస్ నాయకులు సుధాకర్, సీతారాములు, చందర్‌రావు, వర్తకసంఘం అధ్యక్షుడు రాంబాబు పాల్గొన్నారు.

ఆలయాల్లో కల్యాణ శోభ

అశ్వాపురం: మండల పరిధిలోని సంద్రలబోడు గ్రామంలోని బండ్లసిరిగుట్టపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి 18వ వార్షిక కల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గొందిగూడెం గ్రామంలో వెంకటేశ్వరస్వామి 24వ వార్షిక కల్యాణ మహోత్సవాన్ని ఏర్పాటు చేశారు. నెల్లిపాక గ్రామపంచాయతీలోని టేకులగుట్ట గ్రామంలోని శ్రీ కృష్ణుడు ఆలయం ఆవరణలో రాధారుక్మిణి సమేత శ్రీకృష్ణ కల్యాణ మహోత్సవం సోమవారం కన్నుల పండుగగా నిర్వహించారు. మూడు చోట్లా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేయడగా.. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారికి అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆయా పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎంపీపీ సుజాత, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

బూర్గంపాడు: గోదావరితీరంలోని ఇరవెండి సంతాన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వందలాదిమంది భక్తజనంతో వేదపండితుల మంత్రోచ్చారణలతో గోదావరి తీరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు తాళ్లూరి పంచాక్షరయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని అద్భుత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండుగగా సాగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు బిజ్జం జయరామిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన చేశారు. ఆయా కార్యక్రమాలలో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.


బూర్గంపాడు: ఇరవెండిలో సంతాన వేణుగోపాల స్వామి కల్యాణోత్సవం


అశ్వాపురం: వేంకటేశ్వరస్వామి కల్యాణంలో ఎమ్మెల్యే పాయం, ఎంపీపీ సుజాత తదితరులు

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామంలో ఉన్న రుక్మిణి, సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు. పలు పూజా కార్యక్రమాలు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని పాత మణుగూరు(శివలింగాపురం) ప్రాంతంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వార్ల కల్యాణ క్రతువును ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నానిబాబు, మాజీ ఉపసర్పంచ్ సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, నాయకులు పాల్గొన్నారు.

ములకలపల్లి: మూకమామిడి గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయం 14 వార్షిక తిరుకల్యాణ మహోత్సవాన్ని సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సడియం నాగేంద్రబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. భారీగా భక్తులు హాజరయ్యారు.

దుమ్ముగూడెం: మండలంలోని సున్నంబట్టి గ్రామంలో పవిత్ర గోదావరి నదీ తీరాన ఉన్న అదిశేషావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో భూ, నీళ సమేత వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణ మహోత్సవం వైభవంగా సోమవారం అర్చకులు జరిపారు. పలు పూజా కార్యక్రమాలు చేసి అన్నప్రసాదాలను అందించారు.

చర్ల: మండలంలోని దేవానగరం, కుదునూరు గ్రామాలోని దేవాలయాల్లో సోమవారం వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా సాగాయి. కుదునూరులోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవాలయంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. దేవాలయ ప్రాంగణాల్లో అన్నదానాలు ఏర్పాటు చేశారు. స్వామివారి శోభాయాత్రలు నిర్వహించారు.